**Eenadu**

# ఎస్సై, ఏఎస్సై పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పోలీసు కమ్యూనికేషన్ విభాగంలో ఎస్సై, వేలిముద్రల విభాగంలో ఏఎస్సై ఉద్యోగాల భర్తీకి ఏపీ పోలీసు నియామక మండలి బుధవారం ప్రకటన జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 15 ఎస్సై, 13 ఏఎస్సై పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఆయా పోస్టుల పరీక్షా విధానం, అర్హతల వివరాలను ఏపీ పోలీసు నియామక మండలి ఛైర్మన్ అతుల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులను ఈ ఏడాది సెప్టెంబరు 1వ తేదీ నుంచి 25వ తేదీవరకు స్వీకరిస్తారు. 21-25 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు అర్హులు. 400 మార్కులకు మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. కమ్యూనికేషన్ ఎస్సై ఉద్యోగానికి డిప్లమో/బీటెక్(ఈసీఈ, ఈఈఈ, సీఈ, ఐటీల్లో ఏదో ఒక విభాగంలో), బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్) అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. వేలిముద్రల విభాగంలో ఏఎస్సై ఉద్యోగానికి డిగ్రీ (కంప్యూటర్ సైన్స్, ఐటీ, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఏదో ఒక సబ్జెక్ట్‌తో) సాధించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తర్వాత ధ్రువ పత్రాలు పరిశీలించి, శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు.